క్లుప్తంగా

దాడికి యత్నం

నెల్లూరు(క్రైమ్) : పాతకక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిపై దాడికి యత్నించిన ఘటనలో నిందితులపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. మూలాపేట హిమాలయసెంటర్‌కు చెందిన సుబ్రహ్మణ్యం కొత్తూరు నిర్మలానగర్‌లో రేషన్‌షాపు నిర్వహిస్తున్నారు. షాపు విషయమై ఆయనకు సునీల్ అనే వ్యక్తితో మనస్పర్థలున్నాయి. ఈనెల 5వ తేదీ రాత్రి సుబ్రహ్మణ్యం కొండదిబ్బలోని ఓ ఫంక్షన్‌కు వెళ్లారు. అర్ధరాత్రి తన స్నేహితుడు ప్రదీప్‌తో మాట్లాడుతుండగా సునీల్ తన స్నేహితులైన సద్దాం, హేమంత్‌లతో కలిసి అక్కడకు వచ్చారు. సుబ్రహ్మణ్యంపై కత్తితో దాడి చేసేందుకు యత్నించగా ప్రదీప్ అడ్డుకున్నారు. ఫంక్షన్‌లోని వారు సర్ది చెప్పడంతో కొద్దిసేపటికి నిందితులు అక్కడి నుంచి పారిపోయారు. ఈమేరకు బాధితుడు సోమవారం చిన్నబజారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు విచారిస్తున్నారు.

తిరుమల దీవెనయాత్ర ప్రారంభం

నెల్లూరు(బృందావనం) : నగరంలోని పురమందిరం వద్ద జ్యోతి వినాయకస్వామి మందిరం నుంచి తిరుమల ఉచిత దీవెనయాత్రను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యమార్గ్ ఫౌండేషన్ కన్వీనర్ రవిస్వామి మాట్లాడుతూ జిల్లాలోని గ్రామీణ ప్రజలకు తిరుమలలోని శ్రీనివాసుని దర్శనం కలిగించే కార్యక్రమాన్ని గత కొన్ని సంవత్సరాలుగా చేస్తున్నామన్నారు.

ఆశావర్కర్ల ధర్నా

నెల్లూరు(దర్గామిట్ట) : కలిగిరి మండలం రావులకొల్లు ఆశా వర్కర్ పందిటి విజయమ్మను విధుల్లోకి తీసుకోవాలని కలెక్టర్ కార్యాలయం వద్ద చేస్తున్న రిలే నిరాహార దీక్ష సోమవారానికి నాలుగో రోజుకు చేరుకుంది. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టీవీ ప్రసాద్, మహిళా సంఘం కార్యదర్శి మస్తాన్‌బీ మాట్లాడుతూ ఎటువంటి ఆరోపణలు లేకుండానే ఆశవర్కర్‌ను విధుల నుంచి తొలగించడం దారుణమన్నారు.

ఆరోగ్య ఫలం


సీతాఫలం

- సీతాఫలంతో ఎంతో మేలు
- ప్రస్తుతం మార్కెట్‌లో విరివిగా లభ్యం
- ఈ ఏడాది తగ్గిన దిగుబడి, పెరిగిన ధర


నగరంలో తోపుడుబండిపై సీతాఫలాల విక్రయాలు

నెల్లూరు(బారకాసు) : ప్రకృతి నుంచి సహజ సిద్ధంగా లభించే అద్భుతమైన పండ్లలో సీతాఫలం ఒకటి. పేదల ఆపిల్‌గా పేరొందిన ఈ ఫలం నోరూరించే రుచితో పాటు, ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అందుకే చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అందరూ ఈ పండును ఇష్టపడుతారు. ఇది రగనిరోధక శక్తిని పెంచుతుంది. రక్తపోటును అదుపులో ఉంచుతుంది. కొవ్వు శాతం తగ్గిస్తుంది. కంటి చూపును మెరుగు పరుస్తుంది. ఆరోగ్యానికి అవసరమైన పీచుపదార్థాలు, విటమిన్లు, శరీరాన్ని చురుగ్గా ఉంచేందుకు అవసరమైన మెగ్నీషియం సీతాఫలంలో ఎక్కువగా ఉంటుంది. పొటాషియం, మెగ్నీషియం గుండెకు రక్షణ కవచంలా పనిచేస్తూ, బీపీ, గుండె సంబంధిత వ్యాధులను అదుపులో ఉంచుతుంది. అధిక బరువుతో బాధపడుతున్న వారికి ఇది ప్రయోజనకరం. అనవసరపు కొవ్వును తగ్గించి, జ్ఞాపకశక్తిని పెంచుతుంది.

ఏటా అక్టోబర్‌లో..

ఏటా అక్టోబర్ నెలలో మొదలుకుని డిసెంబర్ వరకు సీతాఫలాలు విరివిగా లభిస్తాయి. ఒక్కో ఫలం సైజును బట్టి విక్రయిస్తున్నారు. ఒక్కో సీతాఫలం విడిగా అయితే రూ.10, అదే కిలో రూ.100 చొప్పున విక్రయిస్తున్నారు. నగరంలోని మినీబైపాస్ రోడ్డు, చిన్నబజార్, ట్రంకురోడ్డు, స్టోన్‌హౌస్‌పేట, వేదాయపాళెం, పొదలకూరురోడ్డు, బాలాజీనగర్, నవాబుపేట తదితర ప్రాంతాల్లో సీతాఫలాల విక్రయాలు జరుపుతున్నారు. సైజును బట్టి కిలోకు ఆరేడు సీతాఫలాలు తగ్గుతాయి. ఇవి చిత్తూరు, మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి నెల్లూరుకు దిగుమతి అవుతున్నాయి. ఈ ఫలాలకు మంచి డిమాండ్ ఉండడంతో కొనేందుకు ప్రజలు ఎగబడుతున్నారు.

లభించే పోషకాలు	
కేలరీలు	80 నుంచి 101 మిల్లీ గ్రాములు
తేమ	68.3-81 గ్రాములు
కార్బోహైడ్రేట్స్	25-26 గ్రాములు
కాల్షియం, ఐరన్,	
సోడియం	17-27 మిల్లీ గ్రాములు
విటమిన్-సీ	50 శాతం

ఔషధ గుణాలెన్నో...

- మెదడు నరాల వ్యవస్థ చురుగ్గా పనిచేయడానికి ఉపకరిస్తుంది.
- క్షయవ్యాధి నివారణకు సీతాఫలాన్ని సమర్థమైన ఆహార వైద్యంగా ఉపయోగిస్తారు.
- వేసవి కాలంలో ఇందులో ఉన్న గుజ్జును పాలల్లో కలిపి తాగితే శరీరంలోని వేడి, అతి దాహాన్ని తగ్గిస్తుంది.
- బలహీనంగా ఉన్న పిల్లలు, బాలింతలకు సీతాఫలం గుజ్జును తేనెతో కలిపి తాగిస్తే అధిక శక్తి చేకూరుతుంది.
- తలలో చుండ్రు ఉన్న వారు ఎండిన సీతాఫలం గింజలను మెత్తగా పొడిచేసి, రోజూ షాంపులా వాడితే చుండ్రు త్వరగా తగ్గిపోతుంది.
- సీతాఫలం ఆకులను ఎండబెట్టి, పొడిచేసి కొబ్బరి నూనెలో కలిపి పుండ్ల మీద రాస్తే త్వరగా తగ్గిపోతాయి.

ఉల్లంఘునులపై చర్యలు

నెల్లూరు(క్రైమ్) : నగరంలో ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘునులపై సోమవారం పోలీసు అధికారులు చర్యలు తీసుకున్నారు. వీఆర్సీ కూడలిలో రాంగ్‌రూట్‌లో వస్తున్న వాహనదారులపై సౌత్ ట్రాఫిక్ ఆర్‌ఎస్సై హరికృష్ణ కేసులు నమోదు చేశారు. ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలని, లేనిపక్షంలో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అంతరిక్ష వారోత్సవాలు

నెల్లూరు (టౌన్) : నగరంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో షార్ ఆధ్వర్యంలో అంతరిక్ష వారోత్సవాలను సోమవారం నిర్వహించారు. స్థానిక మద్రాసు బస్టాండ్ నుంచి గాంధీ బొమ్మ వరకు ర్యాలీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన షార్ శాస్త్రవేత్త దామోదరన్ మాట్లాడుతూ స్పేస్ టెక్నాలజీపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

15 వరకు ఎన్‌ఎంఎంఎస్ గడువు పెంపు

నెల్లూరు(టౌన్): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు నమోదు గడువును ఈనెల 15వ తేదీ వరకు పొడిగించినట్లు డీఈఓ పీవీజే రామారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష డిసెంబర్ 8వ తేదీన జరుగుతుందన్నారు.

వినతులపై చర్యలు తీసుకోండి

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో ప్రజాప్రతినిధుల నుంచి వచ్చే వినతులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఓ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని శంకరన్‌హాల్లో సోమవారం జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన అర్జీలను మూడు నెలల్లోగా పరిష్కరించాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు చేయదగిన పనులను వెంటనే చేపట్టాలన్నారు. చేయలేని పనులుంటే స్పష్టమైన వివరాలతో తెలియజేయాలన్నారు. సమావేశంలో డీఆర్వో ఎస్.లవన్న, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, డ్వామా పీడీ గంగాభవానీ, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి, మైక్రో ఇరిగేషన్ పీడీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టెట్‌కు 43 మంది గైర్హాజరు

నెల్లూరు(టౌన్): జిల్లా వ్యాప్తంగా సోమవారం జరిగిన టెట్‌కు 43 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన పరీక్షకు 110 మందికి గానూ 84 మంది హాజరయ్యారు. 26 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 110 మందికి 93 మంది హాజరయ్యారు. 17 మంది గైర్హాజరయ్యారు.

వక్ఫ్ చట్ట సవరణలపై సదస్సు నేడు

నెల్లూరు(అర్బన్) : వక్ఫ్ చట్టానికి కేంద్ర ప్రభుత్వం తెస్తున్న సవరణలు- పరిణామాలు అనే అంశంపై మంగళవారం సాయంత్రం హరనాథపురంలోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహిస్తున్నామని ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్.రషీద్ తెలిపారు. ఈమేరకు నగరంలోని ఆవాజ్ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సదస్సుకు మాజీ ఎమ్మెల్యే, ఆవాజ్ వ్యవస్థాపక నేత ఎంఏ గఫూర్ హాజరై ప్రసంగిస్తారన్నారు. కార్యక్రమంలో సయ్యద్ రఫీ, చాంద్‌బాషా, ఫయాజ్, రియాజ్, అమానుల్లా పాల్గొన్నారు.

చెస్ క్రీడాకారుల ఎంపిక


విజేతలతో చెస్ అసోసియేషన్ సభ్యులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : జిల్లా చెస్ క్రీడాకారులను ఎంపిక చేసే క్రమంలో ఒకరోజు చదరంగం పోటీలను సోమవారం నిర్వహించారు. స్టోన్‌హౌస్‌పేటలోని శ్రీవివేకానంద జూనియర్ కళాశాలలో రాయ్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్ -15 ఓపెన్ పోటీల్లో యజ్ఞేశ్వర్ రెడ్డి, ఎంవీఎస్ హిమ తేజశ్విని, ద్వారకానాథ్, యశ్విన్, సుష్వంత్‌లు విజేతలుగా నిలిచారు. బాలికల విభాగంలో సుదీక్ష, గానవిశ్రీ, గీతికశ్రీ రెండు, మూడు, నాలుగు స్థానాలను సాధించారు. వీరు గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి చెస్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా తరపున ఆడుతారు. గెలుపొందిన వారికి కళాశాల కరెస్పాండెంట్ విష్ణు, జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి మస్తాన్‌బాబు బహుమతులను అందచేశారు. ఆర్బిటర్ మౌనిక, అబ్జర్వర్ అజీజ్ పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు అధికారులు లేకుంటే ఎలా?

- ఆగ్రహం వ్యక్తం చేసిన అదనపు కమిషనర్ శర్మద


అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ శర్మద

నెల్లూరు(బారకాసు) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్) కార్యక్రమానికి అధికారులు లేకుంటే ఎలా అని అదనపు కమిషనర్ శర్మద ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు కమిషనర్ సూర్యతేజ పాల్గొనాల్సి ఉండగా ఆయన ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆన్‌డ్యూటీపై ఇతర ప్రాంతానికి వెళ్లారు. దీంతో అదనపు కమిషనర్ శర్మద ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తూ సంబంధిత అధికారులకు ఆ సమస్యను పరిష్కరించాలని సిఫార్సు చేస్తున్నారు. ఈ క్రమంలో రెవెన్యూ విభాగానికి సంబంధించిన సమస్యపై రెవెన్యూ అధికారి రాజేశ్వరిని పిలువగా అందుబాటులో లేకపోవడంతో ఎక్కడికి వెళ్లారంటూ ఆమెపై మండిపడ్డారు. అదేవిధంగా మరో అధికారి కూడా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి ఇలా జరిగితే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. కాగా మొత్తం 24 ఫిర్యాదులు అందుకున్నామని, వాటిని పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇందులో విభాగాల వారీగా.. రెవెన్యూ విభాగానికి 2, ఇంజినీరింగ్ విభాగానికి 10, టౌన్‌ప్లానింగ్ విభాగానికి 6, పబ్లిక్ హెల్త్ విభాగానికి 2, హౌసింగ్ విభాగానికి 4 చొప్పున ఫిర్యాదులు అందాయని, వాటిని సత్వరమే పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఈ రామ్మోహన్, సిటీ ప్లానర్ కృష్ణకిశోర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య, మేనేజర్ ఇనాయతుల్లా, పలు విభాగాల సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్‌లో తనిఖీలు


మాట్లాడుతున్న అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ

నెల్లూరు(అర్బన్) : నగరంలోని వేదాయపాళెం-చంద్రమౌళినగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను అడిషనల్ డీఎంహెచ్‌ఓ, జిల్లా టీబీ నివారణాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి రికార్డులు పరిశీలించారు. టీబీ పరీక్షల సంఖ్యను, నమోదైన కేసుల వివరాలను చెక్ చేసి ఆస్పత్రి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఖాదర్‌వలీ మాట్లాడుతూ జిల్లాలో టీబీని పూర్తిస్థాయిలో అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు.

ఆర్గానిక్ ఆహారం ఆరోగ్యకరం


ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను పరిశీలిస్తున్న మేయర్ స్రవంతి

నెల్లూరు(సెంట్రల్) : ఆర్గానిక్ ఆహారం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని మేయర్ స్రవంతి అన్నారు. నెల్లూరులోని వీఆర్సీ మైదానంలో జాతీయ మత్స్య అభివృద్ధి సంస్థ, మత్స్యకార సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫిష్ ఫుడ్‌ఫెస్టివల్‌ను మూడో రోజు సోమవారం మేయర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన రాష్ట్రంలో సముద్రం ద్వారా దొరుకుతున్న ఆరోగ్యకరమైన ఆర్గానిక్ ఉత్పత్తులను ఇతర దేశాలకు కూడా ఎగుమతులు చేయడం సంతోషకరమన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యుడు డాక్టర్ ఎమ్మెస్ రెడ్డి మనుమరాలు ఇషారెడ్డి జన్మదినం సందర్భంగా స్టేడియంలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బందికి సోమవారం పదిరకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. అలాగే 200 మంది వాకర్స్‌కు అల్పాహారం అందించారు. అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బాసం శేషగిరిరావు, సభ్యులు ఎస్.రాఘవేంద్ర శెట్టి, ఏకొల్లు రాఘవరెడ్డి డి.సుబ్బరాజు, రామ్మోహన్‌రెడ్డి, భక్తవత్సలరెడ్డి, సురేంద్రబాబు, కె.తిరుపతినాయుడు, కె.రఘురాం ముదిరాజ్, వి.రంగారావు, ఎస్.బలరాం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వార్షిక ప్రణాళికపై శిక్షణ

నెల్లూరు సిటీ : రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులకు వార్షిక కార్యాచరణ ప్రణాళికపై రాష్ట్ర అబ్జర్వర్ రమేష్ ఆధ్వర్యంలో సోమవారం శిక్షణ తరగతులు జరిగాయి. ఎంపీడీఓ శైలేంద్ర కుమార్, ఈఓ వెంకటరమేష్, శివ పాల్గొన్నారు.


విజయకుమార్‌రెడ్డి పరామర్శ

నెల్లూరు సిటీ : జమీన్ రైతు వారపత్రిక సంపాదకుడు డోలేంద్రప్రసాద్‌ను వైఎస్సార్‌సీపీ రూరల్ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. డోలేంద్రప్రసాద్ తల్లి లలితమ్మ శుక్రవారం మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డోలేంద్రప్రసాద్‌ను ఆయన నివాసంలో విజయకుమార్‌రెడ్డి పరామర్శించారు.

దాడులను నిలువరించాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : గాజాపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులను నిలువరించేలా ప్రపంచ దేశాలు ముందుకు రావాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. బాలాజీనగర్‌లోని సీపీఎం కార్యాలయంలో జిల్లా కార్యదర్శి మూలం రమేష్, కార్యదర్శి దామ అంకయ్య సోమవారం మాట్లాడారు. అగ్రరాజ్యాలు ముందుకొచ్చి ఇజ్రాయెల్ యుద్ధాన్ని నిలువరించి ప్రజల ప్రాణాలను కాపాడాలన్నారు. భారత ప్రభుత్వం అదుపులోకి తీసుకున్న నక్సల్స్‌ను బూటకపు ఎన్‌కౌంటర్లు చేయడం తగదన్నారు. కేంద్ర ప్రభుత్వం మానవ హక్కులను కాపాడాలన్నారు. సీపీఎం నేతలు వెంకటేశ్వర్లు, కటారి అజయ్‌కుమార్, రామరాజు, సిరాజ్ పాల్గొన్నారు.


ధర్మరాజస్వామి దేవస్థానంలో..


కోదండరామపురంలో రూ.20 లక్షల కరెన్సీతో ధనలక్ష్మి అలంకారం


వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో..


వేదాయపాళెంలోని కృష్ణమందిరంలో..


మల్లేశ్వరస్వామి దేవస్థానంలో..

దివ్యరూపిణి.. వరప్రదాయిని



నరసింహకొండపై..


మహాలక్ష్మి దేవస్థానంలో..


నెల్లూరు(బృందావనం) : దేవీ శరన్నవ రాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని నగరంలోని అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలను నిర్వహిస్తున్నారు. ఐదో రోజు సోమవారం భక్తులు భారీగా తరలి వచ్చి జగజ్జననిని దర్శించుకొని తన్మయత్వం చెందారు.

- రాజరాజేశ్వరి ఆలయంలో గజలక్ష్మి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా పొట్టేపాటి ద్వారకానాథ్‌రెడ్డి, కొలపర్తి వెంకట రమేష్‌కుమార్, సువర్ణలక్ష్మి, కొమ్మన తిరుమలేశ్వరరెడ్డి, లక్ష్మీశిరీష వ్యవహరించారు.
- ఇరుకళల పరమేశ్వరి దేవస్థానంలో సరస్వతి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా కె.రాజాచారి, లక్ష్మి, కె.ప్రతాప్‌రెడ్డి, సుమన, కె.సురేష్‌బాబు, లక్ష్మీప్రసన్న దంపతులు వ్యవహరించారు.
- మూలాపేటలోని శ్రీకృష్ణధర్మరాజ స్వామి దేవస్థానంలో అమ్మవారు లలితా అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా ఉడాలి అశ్వత్థనారాయణ వ్యవహరించారు.
- నవాబుపేటలోని శ్రీకృష్ణధర్మరాజ స్వామి దేవస్థానంలో రాజరాజేశ్వరిదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా నగిరి చంద్రశేఖర్‌రావు, కుటుంబసభ్యులు వ్యవహరించారు.
- స్టోన్‌హౌస్‌పేటలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో గాయత్రి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. మూలవర్లను ముత్యాలచీరతో, పుష్పాలతో విశేషంగా అలంకరించారు. ఉభయకర్తలుగా ఏల్చూరు శ్రీనివాసరావు- లక్ష్మీకుమారి, కొనగళ్ల శ్రీనివాసులు- సుభాషిణి దంపతులు వ్యవహరించారు.
- మూలాపేటలోని మూలస్థానేశ్వర స్వామి దేవస్థానంలో రాజరాజేశ్వరి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా ఎం.రమేష్- పద్మజ, ఎస్.చంద్రయ్య- దేవసేన దంపతులు, ఆర్ఆర్.నాయుడు, సుందరమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు వ్యవహరించారు.
- కోదండరామపురంలోని మహాలక్ష్మి దేవస్థానంలో ధనలక్ష్మి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా చదలవాడ ప్రసాద్- కాంచన, ముచ్చర్ల సుబ్బారాయుడు- లత, మద్దాలి శ్రీనివాసరావు- అజితకుమారి, పెనల జగదీష్- లక్ష్మి దంపతులు వ్యవహరించారు.
- బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో పార్వతిదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా పచ్చిపులుసు శ్రీరాములు- అనసూయ, శ్రీనివాసరావు- సాయిలక్ష్మి, వెంకటఆనంద కిశోర్- శ్వేత దంపతులు వ్యవహరించారు
- విరాట్‌నగర్‌లోని వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలో లలితామహేశ్వరిదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా ఎం.సుమన్ ఆచారి- నాగమణి, జి.గురుబ్రహ్మం శ్రేష్టి- లక్ష్మీరజని, ఎల్.గోపికృష్ణాచారి- హారతి దంపతులు వ్యవహరించారు.
- వేదాయపాళెంలోని గాంధీనగర్ కృష్ణ మందిరంలో ఉన్న వైభవలక్ష్మి ఆలయంలో ధైర్యలక్ష్మి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా తిక్కవరపు శ్రీనివాసులురెడ్డి- స్రవంతి దంపతులు, జె.వసుంధర కుటుంబసభ్యులు వ్యవహరించారు.
- నవాబుపేటలోని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో గాయత్రిదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా ఇర్తిని కృష్ణప్రసాద్ వ్యవహరించారు.
- నవాబుపేటలోని మహాలక్ష్మి దేవస్థానంలో గాయత్రిదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా నాగేళ్ల వినోద్‌కుమార్- తరంగిణి దంపతులు, పి.సుశీల కుటుంబసభ్యులు వ్యవహరించారు.
- సుజాతమ్మ కాలనీలోని అష్టలక్ష్మి మందిరంలో ధనలక్ష్మి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా టి.యానాదయ్య- విజయ, సీహెచ్.సుబ్బారెడ్డి- సుప్రజ, పి.సుబ్బారెడ్డి- లక్ష్మీదేవి దంపతులు వ్యవహరించారు.
- సంతపేట కంసాలివీధిలోని శ్రీహరి హరనాథస్వామి దేవస్థానంలో మీనాక్షి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా సతీష్‌కుమార్- శ్రీలత, ఎం.శ్రీకాంత్‌కుమార్- అంజనా ప్రవీణ, ఎం.శరత్‌కుమార్- వెంకటసౌభాగ్య దంపతులు వ్యవహరించారు.
- రంగనాయకులపేటలోని రంగనాథ స్వామి దేవస్థానంలో తిరుమంజనం, ప్రాకారోత్సవం జరిగింది. ఉభయకర్తలుగా ఆర్.రాజమన్నార్- ఉష దంపతులు వ్యవహరించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈఓ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.
- నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని వెంకటేశ్వరపురంలో ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో మోహినీ అలంకారంలో స్వామివారు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా పులి కోదండరామయ్య- ఇందిర, మడతల గురవారెడ్డి- భారతి దంపతులు వ్యవహరించారు.
- నెల్లూరు సిటీ : రూరల్ మండలం నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో సంతాన లక్ష్మి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా నరసింహ, లీలకృష్ణ, హరిత వ్యవహరించారు.


అష్టలక్ష్మి మందిరంలో..


ఉమామహేశ్వరస్వామి దేవస్థానంలో..


సీతారామస్వామి మందిరంలో..


రంగనాథునికి ప్రాకారోత్సవం


వెంకటేశ్వరపురంలో..

దాడిపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్) : మతిస్థిమితం లేని మహిళపై దాడిచేసిన ఘటనలో నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఆనం వెంకటరెడ్డి మున్సిపల్ క్వార్టర్స్‌లో షాహినా కుటుంబం నివాసం ఉంటోంది. ఆమెకు వరుసకు పెద్దమ్మ అయిన హసీనాకు మతిస్థిమితం సరిగా లేదు. దీంతో పాటుగా సొంతిల్లు లేకపోవడంతో అప్పుడప్పుడు షాహీనా వద్దకు వచ్చివెళ్లేది. గతనెల 27న తెల్లవారుజామున హసీనా అదే వీధిలోని ఓ అరుగుమీద కూర్చొని ఉంది. పాతమున్సిపల్ ఆఫీసు ప్రాంతానికి చెందిన సాయిచంద్ అటువైపు వెళ్తుండగా హసీనా అతనిని దుర్భాషలాడింది. దీంతో యువకుడు ఆమెపై దాడిచేసి గాయపరిచాడు. ఈ మేరకు షాహినా సోమవారం చిన్నబజారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హోమ్‌గార్డుకు పరామర్శ

నెల్లూరు(క్రైమ్): గుండెపోటుకు గురై బొల్లినేని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హోమ్‌గార్డు అనిల్‌ను నవాబుపేట ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా సోమవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. ధైర్యంగా ఉండాలని చెప్పారు.